
లయ తప్పుతోంది

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- జీవన శైలిలో మార్పులే కారణం
- నేడు ప్రపంచ హృద్రోగ దినం



కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే

కార్డియోథొరాసిక్ విభాగంలో శస్త్రచికిత్సల వివరాలు

సంవత్సరం	మైనర్	మేజర్
2023	549	328
2024 (సెప్టెంబరు)	543	232

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మంది గుండె జబ్బులబారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏటా సుమారు 25 వేల మంది చికిత్స పొందుతున్నారు. మరికొందరు సకాలంలో వీటిని గుర్తించలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క కర్నూలు సర్వజన ఆస్పత్రికి ప్రతి నెలా కొత్తగా 120 గుండె జబ్బు కేసులు వస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ భారీగా నమోదవుతున్నాయి. ఆదివారం ప్రపంచ హృద్రోగ దినం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కర్నూలు నగరానికి చెందిన సురేశ్ (40) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 21న అర్ధరాత్రి వేళ విపరీతమైన గుండె నొప్పితో అల్లాడారు. కుటుంబ సభ్యులు పెద్దాస్పత్రిలోని అత్యవసర విభాగానికి తీసుకురాగా వైద్యులు పరీక్షలు చేసి కార్డియాలజీ విభాగానికి తరలించారు. మూడు రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. పరిస్థితి మెరుగుపడటంతో వార్డులోకి మార్చారు.

● కర్నూలు పెద్దాస్పత్రే ఆధారం

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆస్పత్రుల్లో గుండె జబ్బులకు సంబంధించి వైద్య చికిత్సలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఫలితంగా చాలామంది కర్నూలు సర్వజన ఆస్పత్రిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వైద్యాలయంలోని కార్డియాలజీ విభాగంలో ప్రతినెలా ఓపీ 1,400, ఐపీ 300 వరకు ఉంటోంది. ప్రతినెలా 50 నుంచి 70 యాంజియోగ్రామ్‌లు చేస్తున్నారు. 20 నుంచి 25 వరకు స్టెంట్లు వేస్తున్నారు.

సర్వజన ఆస్పత్రిలో సేవలు ఇలా..


కార్డియోథొరాసిక్ విభాగంలో ప్రతి నెలా ఓపీ 200, ఐపీ 20 నుంచి 30 నమోదవుతోంది. ఇక్కడ ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ఉన్నారు. గుండె శస్త్రచికిత్సలన్నీ రెఫరల్ లేదా ఇతర ఆస్పత్రుల నుంచే ఎక్కువగా వస్తున్నాయి. ఓపీ నుంచి కేసులు తక్కువగా వస్తుండటం గమనార్హం. జూనియర్ సర్జన్ ఉన్నప్పటికీ శస్త్రచికిత్సల థియేటరు వద్దకు రానీయడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రథమ చికిత్సతో సరి..

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ కార్డియాలజీ ఓపీ రోజుకు 30 నుంచి 45 వరకు ఉంటుంది. అత్యవసర కేసులు వచ్చినా కేవలం ప్రథమ చికిత్స అందించి కర్నూలుకు పంపేస్తున్నారు. కర్నూలుకు వెళ్లలేనివారు నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ లేరు. దీనికితోడు శస్త్రచికిత్స నిపుణులు, ఫిజీషియన్ల కొరత వేధిస్తోంది. అవసరమైన వైద్యులతోపాటు క్యాథ్‌ల్యాబ్ అందుబాటులో ఉంటే రోగులకు ఎంతో మేలు జరుగుతుంది.

పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ

గతంలో 50 ఏళ్లు దాటిన వాటికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ప్రస్తుతం 25 ఏళ్లవారు సైతం దీని బారినపడుతున్నారు. జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం.. పని ఒత్తిడితో చాలామంది ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 10 నుంచి 13 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 8 శాతం మంది గుండె జబ్బుల బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.



లక్షణాలు గుర్తించాలి

– డా.చంద్రశేఖర్, కార్డియాలజీ నిపుణులు



చెమటలు పట్టడం.. ఎడమ చేయి లాగడం ఇతర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. గుండెలో నొప్పి వచ్చినప్పుడు కొందరు గ్యాస్ట్రిక్ సమస్య అని నిర్లక్ష్యం చేస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం. కొవిడ్ తర్వాత గుండె జబ్బు సమస్యలు ఎక్కువయ్యాయి. కరోనా కారణంగా పలువురిలో ఊపిరితిత్తులు దెబ్బతినడంతో శరీరానికి ఆక్సిజన్ సరిగా అందడం లేదు. ఫలితంగా గుండెపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతోంది.


కొత్త సర్కిళ్లు.. మెరుగవనున్న సేవలు

● నంద్యాలలో నూతనంగా ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లా పునర్విభజన జరిగి రెండున్నరేళ్లు కావొస్తోంది. ఏపీఎస్పీడీసీఎల్ సెక్షన్ విభజన మాత్రం జరగలేదు. నేటికీ కర్నూలు సెక్షన్ కిందే నడుస్తోంది. ఫలితంగా వినియోగదారులకు వివిధ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారించింది. ప్రజల సౌకర్యార్థం కర్నూలు కేంద్రంగా ఉన్న విద్యుత్తు సర్కిల్ కార్యాలయాన్ని విభజించి నంద్యాల కేంద్రంగా మరో సర్కిల్ ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగానే డివిజన్లు ఉంటాయి. ఇటీవల కొత్తగా ఏర్పడిన ఎమ్మిగనూరు డివిజన్‌ను కర్నూలుకు, ఆత్మకూరు డివిజన్‌ను నంద్యాల సర్కిల్‌లో విలీనం చేశారు.

సిబ్బంది విభజనకు సన్నాహాలు

ప్రస్తుతం కర్నూలు సర్కిల్ పరిధిలో అన్ని విభాగాల్లో కలిపి 4,200 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిని కర్నూలు, నంద్యాల సర్కిళ్ల వారీగా విభజించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిబ్బంది నియామకంపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ముందుగా సిబ్బందిని సర్కిళ్ల వారీగా కేటాయించి.. అక్కడి నుంచి డివిజన్ల వారీగా కేటాయించే అవకాశముంది.



సర్కిళ్ల వారీగా సిబ్బంది కేటాయింపు వివరాలు

హోదా	కర్నూలు	నంద్యాల
ఎస్‌ఈ	1	1
ఈఈ	3	3
డిప్యూటీ ఈఈ	7	7
సీనియర్ అసిస్టెంట్లు	65	70
జేఏవో	14	15
ఏవో	6	6
ఏఈఈ	25	27



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావుతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి తదితరులు

ప్రత్యేక నేర చట్టాలపై కార్యశాల

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి అధ్యక్షతన శనివారం నగరంలోని జిల్లా కోర్టులో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులకు ప్రత్యేక నేర చట్టాలపై కార్యశాల నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు ముఖ్య అతిథిగా హాజరై గృహ హింస చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.

నాలుగు ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పత్తి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించింది. పొడుగు పింజ క్వింటా రూ. 7,521, పొట్టి పింజను రూ. 7,121 ధరతో



సీసీఐ ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సి.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడులో సీసీఐ ప్రతినిధులు పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 1న పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నారని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, శిక్షణ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

30న ప్రజా సమస్యల పరిష్కార వేదిక


కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, పురపాలక కార్యాలయాలు, డివిజన్ స్థాయిల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొడిగిస్తారా.. ముగిస్తారా

- రీసర్వే డీటీల రెండేళ్ల పదోన్నతి గడువు పూర్తి

భూ రీసర్వే పేరుతో గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. క్షేత్రస్థాయిలో తలెత్తే వివాదాలు, సమస్యల పరిష్కారానికి రీసర్వే డీటీ పోస్టులను తెరపైకి తెచ్చింది. రెండేళ్ల కాల పరిమితితో 'సూపర్ న్యూమరీ' పోస్టులు సృష్టించింది. మరోవైపు రీసర్వే గందరగోళంగా మారింది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకమైంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రీసర్వే ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ రీసర్వే ప్రక్రియను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో భూ రీసర్వే డీటీలుగా నియమితులైనవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



రాష్ట్ర వ్యాప్తంగా 22-09-2022న 679 మంది సీనియర్ అసిస్టెంట్లను రీసర్వే డీటీలుగా అప్పటి వైకాపా ప్రభుత్వం కొత్త పోస్టుల్లో నియమించింది. కర్నూలు జిల్లాలో 25 మండలాలు, ఒక అర్బన్ మండలం కలిపి 26 మండలాలకు 26 మంది, నంద్యాల జిల్లాలో 29 మండలాలకు 29 మంది రీసర్వే డీటీలను నియమించారు. రెవెన్యూ డివిజనల్, తహసీల్దారు కార్యాలయాల్లోని సీనియర్ సహాయకుడి పోస్టులు తాత్కాలికంగా రద్దు చేసి రీసర్వే డీటీ పోస్టులను సృష్టించారు. ఇందులో భాగంగా సీనియర్ సహాయకుడు/ఎంఆర్‌ఐలకు తాత్కాలిక పదోన్నతి కల్పించారు. రెండేళ్ల కాల పరిమితితో ఇచ్చిన పదోన్నతి గడువు ఈనెల 22తో ముగిసింది. ప్రస్తుత నెలకు సంబంధించి 22 రోజులకు జీతం బిల్లు ఆమోదం తెలపాలంటూ జిల్లా ఖజానా శాఖ నుంచి సంబంధిత ఉప ఖజానా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పదోన్నతి గడువు పొడిగిస్తారా? లేదా? అన్న సందిగ్ధం నెలకొంది.

నిర్దిష్ట విధులేవీ..

ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీ పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి దృష్ట్యా ఈ ఏడాది ఏప్రిల్ నుంచే భూ రీసర్వే ప్రక్రియ ఆపేశారు. అప్పటి నుంచి వారికి నిర్దిష్టమైన విధులు లేవు. కొందరు రీసర్వే డీటీలను కలెక్టరేట్లలోని వివిధ సెక్షన్లలో.. మరికొంత మందిని సంబంధిత మండల తహసీల్దార్లు తమ పరిధిలో ఏదో పని చేయించుకుంటూ గడిపేస్తున్నారు. ప్రస్తుతం వారికి జీతాల సమస్య తలెత్తింది.

నెల రోజుల వేతనం ఇవ్వండి

ఈనెల 22తో భూ రీసర్వే డీటీల గడువు ముగిసినా నెల రోజుల వేతనం ఇవ్వాలని జిల్లా ఖజానా శాఖ అధికారులకు జేసీ డా.బి.నవ్య లేఖ రాశారు. వారిని కొనసాగించకుంటే 8 రోజుల వేతనం రికవరీ చేయించేలా తాము కంట్రోలింగ్ అధికారిగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల ఎస్టీవోలకు మార్గదర్శకాలు పంపాలని ఖజానా శాఖ డీడీకి సూచించారు.

● తహసీల్దారు కార్యాలయాల్లో డీడీవోలుగా ఉన్న ఉప తహసీల్దార్లు రీసర్వే డీటీలకు సెప్టెంబరు వేతనం మంజూరు చేయాలని కోరుతూ డిక్లరేషన్ ఫారాలు ఇవ్వనున్నారు. జేసీ ఆదేశాలతో మండలాల డీడీవోలు (డీటీలు) మళ్లీ బిల్లులు పంపుతున్నారని జిల్లా ఖజానా శాఖ డీడీ రామచంద్రరావు తెలిపారు.

కొనసాగిస్తే సరి.. లేకుంటే

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భూముల రీసర్వే ఆపేసింది. మరి రీసర్వే డీటీలను కొనసాగిస్తుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వారిని కొనసాగించకుంటే మళ్లీ సీనియర్ సహాయకులుగా వెనక్కు రానున్నారన్న చర్చ సాగుతోంది.

అభివృద్ధి చేసి చూపిస్తున్నాం : ఎంపీ

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించిందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. కల్లూరు పట్టణం శరీన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంపీ కార్యాలయాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. తెదేపా సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టులు సైతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మానవత్వం అని కొత్త మతాన్ని సృష్టించారని విమర్శించారు. వైఎస్ జగన్ నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తితిదే లడ్డూను కల్తీ చేసి పాపం చేశారన్నారు. ప్రతి మండలంలో ఎంపీ కార్యాలయాన్ని ఏర్పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. అంతకుముందు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





RAMOJI F·I·L·M C·I·T·Y®

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి




మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నా పెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

కలెక్టరేట్‌లో ప్రక్షాళనకు చర్యలు

స్పందనకు వందనం



కలెక్టరేట్‌లో అతికించిన నోటీసు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వదలం బొమ్మాళీ.. వదలం.. కలెక్టరేట్‌లో కదలని పీఠాలు శీర్షికతో శనివారం ఈనాడులో కథనం ప్రచురితమైంది. ఇది జిల్లాలో, కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈనాడు కథనంపై కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పందించారు. రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియపై కలెక్టర్ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల నుంచి డిప్యుటేషన్లపై కలెక్టరేట్‌కు వచ్చారు, ఎక్కడికక్కడ పోస్టింగ్ వేశామో అక్కడే పని చేయాలి. కలెక్టరేట్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్న వారికి బదిలీలు చేయాలని, మండలాలకు నియమించిన వారిని డిప్యుటేషన్లపై కలెక్టరేట్‌కు నియమించరాదని వారిని ఆదేశించినట్లు సమాచారం. జీవో 75 మేరకు ఉద్యోగుల బదిలీలు ఈ నెల 23 నుంచి నిషేధించారు. ఈ నేపథ్యంలో బదిలీలు, డిప్యుటేషన్ల అర్జీలు స్వీకరించబడవు అంటూ కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో కాగితాలు అతికించారు. కలెక్టరేట్ సెక్షన్లను ప్రక్షాళన చేయాలని, జిల్లా పాలనాధికారి కార్యాలయంలో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూడాలని రెవెన్యూ అధికారులను హెచ్చరించినట్లు సమాచారం.

దసరాకు 758 ప్రత్యేక బస్సులు

కడప, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా కడప ఆర్టీసీ జోన్ (కడప, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల) పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు శనివారం వెల్లడించారు. అక్టోబరు 4 నుంచి 11వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచుతామని, సాధారణ టికెట్ ఛార్జీలే వసూలు చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి 285, బెంగళూరు నుంచి 224, విజయవాడ నుంచి 76, చెన్నై నుంచి 40, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు 133 బస్సులు ఏర్పాటు చేసామన్నారు. 13వ తేదీ నుంచి తిరుగు ప్రయాణానికి 596 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడకు 73, హైదరాబాద్‌కు 215, బెంగళూరుకు 253, చెన్నైకి 23, ఇతర ప్రాంతాలకు 32 చొప్పున బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు విమానాశ్రయంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాల్‌లో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో మహిళా పోలీసులను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం నుంచి ఓర్వకల్లుకు, కర్నూలుకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఓర్వకల్లు నుంచి కర్నూలుకు వెళ్లే బస్సును వయా విమానాశ్రయం నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. చెత్త చెదారాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అత్యవసర సమయాలలో వైద్య సౌకర్యాలు, అంబులెన్స్ ఏర్పాటు చేయడంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్, డీపీవో నాగరాజు నాయుడు, డీఎఫ్‌వో, డీఎంహెచ్‌వో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వారిని వెంటబెట్టుకుని తిరుగుతారా?

● ఎమ్మెల్యేను అడ్డుకున్న తెదేపా నాయకులు



ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీస్తున్న తెదేపా నాయకులు

చిన్నహరివాణం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని మండలం చిన్నహరివాణంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే పార్థసారథిని తెదేపా నాయకులు అడ్డుకున్నారు. సమాచారం లేకుండా గ్రామానికి ఎలా వస్తారని నిలదీశారు. ఎన్నికల సమయంలో కష్టపడి గెలిపించామని, ప్రస్తుతం గ్రామంలోని వైకాపా నాయకులను వెంట వేసుకొని తిరుగుతున్నారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. గత ఐదేళ్ల కాలంలో వైకాపా నాయకులు కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామంలో వారే అధికారం చెలాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే వారికి సర్ది చెప్పి గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భాజపా జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తాలూకా సీఐ నల్లప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్యం దుకాణ అనుమతుల కేటాయింపునకు సన్నద్ధం

కర్నూలు నేరవిభాగం, నంద్యాల నేరవిభాగం న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం అమలుకు జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఇతర అధికారులు సన్నద్ధమవుతున్నారు. త్వరలోనే కర్నూలు జిల్లాలో 90, నంద్యాల జిల్లాలో 98 మద్యం దుకాణాల అనుమతులకు ప్రకటన వెలువడనుంది. మద్యం దుకాణాల అనుమతుల సంఖ్యలో మార్పులు జరిగే అవకాశముంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగానే ఆయా జిల్లా కలెక్టర్లు గజిట్ విడుదల చేస్తారు. దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ పూర్తి కాగానే లక్కీడిప్ పద్ధతిలో జిల్లా కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ల సమక్షంలో అనుమతులు కేటాయిస్తారు. దుకాణ అనుమతుల కేటాయింపు ప్రక్రియ రెండు జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఈ ప్రక్రియ కర్నూలులోని జిల్లా పరిషత్ హాలులో జరిగేది. ఉదయం మొదలయ్యే ప్రక్రియ అర్ధరాత్రి దాటే వరకు కొనసాగేది. ప్రస్తుతం రెండు జిల్లాలు కావడంతో సాయంత్రానికంతా ముగియనుంది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

పుచ్చకాయలమడ (పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో అక్టోబర్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననుండటంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్డీవో రామలక్ష్మి శనివారం గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు, తెదేపా నాయకులతో చర్చించారు. పింఛన్ల పంపిణీలో భాగంగా చంద్రబాబు నాయుడు కొందరు లబ్ధిదారుల ఇళ్లకు అందించనున్నారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో వేదిక నిర్మాణం.. ఆయన పర్యటించే మార్గంలో ఎలాంటి ఘటనలు జరగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

'మా భూమిని మాయం చేశారు'



ఆర్డీవో కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన బాధితులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తమ భూమిని రెవెన్యూ అధికారులు వేరే వారి పేరు మీద ఆన్‌లైన్లో ఎక్కించి తమకు తీవ్ర అన్యాయం చేశారని పట్టణానికి చెందిన నాగభూషణం, ఆయన కుమారులు శనివారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవోను కలిసేందుకు వచ్చిన బాధితులకు ఆమె ప్రస్తుతం అందుబాటులో లేరని, మరోసారి రావాలని సిబ్బంది చెప్పడంతో బాధితులు వాగ్వాదానికి దిగారు. బాధితులు మాట్లాడుతూ.. సర్వే నం.724-2, ఖాతా సంఖ్య 831లో 16.190 ఎకరాల భూమి ఉండగా అందులోని 3.10 ఎకరాల భూమిని కొలిమి ఫాతిమా అనే మహిళ పేరుతో అప్పటి తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ కలసి ఆన్‌లైన్లో చేర్చారన్నారు. విషయం తెలుసుకొని వారిని నిలదీయగా తమకు ఏమీ తెలియదంటూ బుకాయిస్తున్నారని వాపోయారు. గత ఎనిమిది నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. తమ గోడు పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయమై కర్నూలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. అక్కడి నుంచి ఆర్డీవోకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు అందాయన్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు, ఆర్డీవో బదిలీ అవుతుండటంతో తమ సమస్య పరిష్కరించాలని మరోమారు ఆర్డీవోను కలిసేందుకు వచ్చామన్నారు. రికార్డుల్లో మాయం చేసిన మా భూమిని తిరిగి మార్చి తమకు న్యాయం చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

2న స్కేటింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో అక్టోబరు 2న ఉదయం 8:00 గంటలకు జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి బైరెడ్డి పక్కీర్‌రెడ్డి, పి. సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. ఇన్లైన్, క్వాడ్ స్కేటింగ్, రింక్, రోడ్ రేస్‌లలో పోటీలు ఉంటాయన్నారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ (ఆర్ఎస్ఐ)లో నమోదు చేసుకొని ఉన్న ధ్రువపత్రం, ఆధార్ కార్డు, పాఠశాల బోనోఫైడ్ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ పోటీలకు అంజి రాష్ట్ర పర్యవేక్షకులు వ్యవహరిస్తారన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నవంబరు 6 నుంచి 10 వరకు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 90905 01082 చరవాణిని సంప్రదించాలన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలోనే అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా వెనుకబడిన ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కర్నూలు జిల్లా ఆలూరులోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో శనివారం మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నాయని అన్నారు. పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దసరా వచ్చిందంటే ఆలూరు నియోజకవర్గంలో ఇప్పటికీ కర్రల సమరం జరుగుతుందని.. దీనికి మూఢ నమ్మకాలు, విద్యా పరంగా వెనుకబాటుతనమే కారణమన్నారు. ఈ ప్రాంతంలో తాగు, సాగు నీటి సమస్య తీరాలంటే వేదవతి ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితరులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడుకు విన్నవిస్తామని తెలిపారు. తిరుపతి లడ్డూ అంశం చాలా సున్నితమైందని.. రాష్ట్రంలో ఇంకేమీ సమస్యలు లేనట్లు దానిపై చర్చ జరగడం మంచిది కాదని పేర్కొన్నారు. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా కులాన్ని, మతాన్ని ప్రస్తావించకూడదని అన్నారు. దేవుడిని రాజకీయ వివాదాల్లోకి లాగొద్దన్నారు.

ఏఆర్ఎస్ టీకా వేయించుకోవాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వీధిలోగాని, పెంపుడు కుక్కలుగాని కరిచినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఏఆర్ఎస్ టీకా వేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ సూచించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ప్రపంచ రేబిస్ నివారణ దినాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేబిస్ జంతువుల నుంచి మనుషులకు రాబ్డో అనే వైరస్ ద్వారా వ్యాపిస్తుందన్నారు. మనుషులను కరిచినప్పుడు సంక్రమిస్తున్నారు. 2024లో ఇప్పటి వరకు 7,028 కుక్క కాటు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త హేమలత, ఏవో అరుణ, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్, ఎస్‌వో హేమసుందర్ పాల్గొన్నారు.



ర్యాలీలో డీఎంహెచ్‌వో, సర్వజన వైద్యశాల సిబ్బంది

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఇష్టంతో చదవాలి

ఆలూరు, న్యూస్‌టుడే: కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తెదేపా ఆలూరు నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చొరవతో అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు గోరంట్ల వాసుబాబు ఆలూరులోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలకు బోధన సామాగ్రి, సైన్స్ పరికరాలు అందజేశారు. సంబంధిత గదిని శనివారం ప్రారంభించి వాటిని పరిశీలించారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించేలా చూస్తామని పేర్కొన్నారు. విద్యాధికారి చిరంజీవిరెడ్డి, ప్రధానోపాధ్యాయిని సుజాత, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రాఘవరావు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



పరికరాలు పరిశీలిస్తున్న రామకృష్ణ, వీరభద్రగౌడ్

పత్తి క్వింటా రూ.7,621

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం పలికిన వివిధ పంట దిగుబడుల ధరలు ఇలా ఉన్నాయి. పత్తి క్వింటా కనిష్ఠంగా రూ.4,211, గరిష్ఠ ధర రూ.7,621, మధ్యస్థం రూ.7,419 పలికింది. వేరుశనగ రూ.3,269-7,339-6,469, ఆముదాలు రూ.5,400-6,088-6,058, పూలవిత్తనాలు రూ.5,375-5,535-5,535 పలికాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెరలోని బీసీ వసతి గృహం నుంచి వచ్చే మురుగు పక్కనే ఉన్న శివాలయం వద్ద చేరి దుర్వాసన వస్తోంది. ఈ నీరు రాకుండా చర్యలు చేపట్టాలి. **-గోపాల్, మద్దికెర**

సమాధానం: పరిశీలించి నీరు ఆలయం పరిసర ప్రాంతాల్లోకి చేరకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. **-శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర**

బిల్లులు చెల్లించాలని ఆందోళన



కౌన్సిల్ హాలులో బైఠాయించి నిరసన తెలుపుతున్న తెదేపా నాయకులు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోనిలో నిర్మించిన అన్న క్యాంటీన్ల బిల్లులు చెల్లించాలని తెదేపా నాయకులు శనివారం పురపాలక కార్యాలయంలో నిరసన తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమావేశం జరుగుతుండగా, ఆ పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. అన్న క్యాంటీన్ల బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎదుట రంగస్వామి నాయుడు, బాబునాయుడు, వెంకటేష్ చౌదరి వాపోయారు. లిఖితపూర్వకంగా రాసివ్వాలని సబ్ కలెక్టర్ చెప్పి వెళ్లిపోయారు. అనంతరం తెదేపా నాయకులు సమావేశంలో ఉన్న పురపాలక కమిషనర్ కృష్ణ వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన అన్న క్యాంటీన్ల నిర్మాణ బిల్లులను విడుదల చేయకుండా ఎందుకు నిలిపారని ప్రశ్నించారు. గత నెల కౌన్సిల్ సమావేశంలో అన్న క్యాంటీన్లకు సంబంధించి రూ.36 లక్షల బిల్లులు పొందుపర్చారని, అయితే ఈ నెల జరిగే కౌన్సిల్ అజెండాలో పొందుపరచకపోవడానికి కారణాలు చెప్పాలని పట్టుబట్టారు. అప్పులు చేసి పనులు పూర్తి చేశామని గుత్తేదారుడు వెంకటేష్‌చౌదరి వాపోయారు. దీంతో పాటు పురపాలక కమిషనర్, ఎంఈలకు బాడుగకు ఇచ్చిన కార్లకు నాలుగు నెలలుగా అద్దెలు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే డా.పార్థసారథి జోక్యం చేసుకొని అధికారులను వివరణ కోరాలని వారు డిమాండ్ చేశారు. చివరికి తెదేపా నాయకులు పట్టు విడవకపోవడంతో కౌన్సిల్ హాల్ తలుపు మూసివేసి అధికారులను బయటకు పోనియకుండా బైఠాయించారు. దీంతో ఎమ్మెల్యే డా.పార్థసారథి, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్, అధికారులు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ సోమన్న సిబ్బందితో అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న తెదేపా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు కుమారుడు భూపాల్‌చౌదరి పురపాలక కార్యాలయానికి చేరుకొని కమిషనర్ కృష్ణ, సహాయ కమిషనర్ అనుపమ, ఎంఈ ఇంతియాజ్ అలీతో సమావేశమై చర్చించారు. కౌన్సిల్ అజెండాలో అన్న క్యాంటీన్ల బిల్లులు పెట్టించి, ఆమోదిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో తెదేపా నాయకులంతా శాంతించారు.

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే డా.పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక పురపాలక కౌన్సిల్ హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్ల నిర్మాణ పనులను నాసిరకంగా చేశారని ఆరోపణలున్నాయన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్, ఎంఈకు ఇద్దరు వ్యక్తులు రెండు కార్లు బాడుగకు ఇచ్చారని వాటికి ఎల్లో ప్లేట్లు లేవని, సొంత డ్రైవర్లు కాకుండా పురపాలక సిబ్బందిని, ఇంధనం కూడా పురపాలక కార్యాలయం నుంచే ఖర్చు చేయిస్తున్నారన్నారు. ఇలా నిబంధనలను అతిక్రమించిన వారికి బిల్లులు ఎలా చెల్లించాలని ప్రశ్నించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం కాకుండా చూస్తున్నామన్నారు.

పోటెత్తుతున్న పొరుగు మద్యం



ఇటీవల స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం డబ్బాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలో చీప్ లిక్కర్ మద్యం తక్కువ ధరకు లభిస్తుంది. మన జిల్లాలో సరిహద్దు గ్రామాలు ఎక్కువ ఉండటంతో అక్రమార్కులు కర్ణాటక మద్యం రవాణా, విక్రయాలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పెట్టుబడి తక్కువ.. లాభం ఎక్కువగా ఉండటంతో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకు వచ్చి అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం అడపా దడపా దాడులు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారనే తప్ప పూర్తి స్థాయిలో విఫలమవుతున్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం సెబ్‌శాఖను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

☛ పట్టణంలోని రాంజల రహదారిలోని పార్కు వద్ద ఈ నెల 22న ఓ ట్రాలీ వాహనంలో పెద్ద ఎత్తున కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో దాదాపు రూ.2 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. డివిజన్‌లో ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దుల్లో ఉండటంతో మద్యం అక్రమ రవాణ యథేచ్ఛగా కొనసాగుతోంది.



పట్టుబడిన మద్యం, నిందితుడిని చూపుతున్న సీఐ రామలింగయ్య (పాత చిత్రం)

ధర తక్కువ.. లాభం ఎక్కువ

మన రాష్ట్రంలో చీప్ లిక్కర్ మందు ధరలతో పోల్చితే కర్ణాటకలో తక్కువ. గత వైకాపా ప్రభుత్వం నాణ్యమైన మద్యం సరఫరా చేయడం లేదన్న ఆరోపణలు రావడంతో మద్యం ప్రియులు కర్ణాటక మద్యానికి అలవాటు పడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ఈ వ్యాపారంపై దృష్టి సారించారు. కర్ణాటకలో మద్యం ధర 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు రూ.40, 180 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు ధర రూ.80 పలుకుతుంది. వాటిని ఇక్కడ రూ.70, రూ.150 ప్రకారం అమ్ముతున్నారు. ఇలా ఒక్కో బాక్సుకు రూ.3 వేలు వరకు ఆర్జిస్తున్నారు.

కొత్త పద్ధతుల్లో రవాణా

అక్రమార్కులు వివిధ మార్గాల్లో కొత్త పద్ధతుల్లో మద్యాన్ని జిల్లాకు తీసుకొస్తున్నారు. జిల్లా సరిహద్దులైన పెద్దహరివాణం, మంత్రాలయం మండలం మాధవరం, కౌతాళం మండలం బాపురం, హాలహర్వి మండలం ఛత్రగుడి, హొళగుంద మండలం మార్లమడికి చెక్‌పోస్టుల మీదుగా ఎవరికి అనుమానం రాకుండా వివిధ సరకు రవాణ వాహనాల్లో మరికొందరు కారులో మద్యాన్ని పెద్ద ఎత్తున తీసుకొస్తున్నారు.

నామమాత్రపు దాడులు

కర్ణాటక మద్యం రవాణపై పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు నామమాత్రపు దాడులు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉన్నా.. సిబ్బంది కొరత తదితర కారణాలతో వాహనాలను సరిగ్గా తనిఖీ చేయడం లేదు. డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయాలు కొనసాగుతున్నా.. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కటారుకొండ (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని కటారుకొండ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎన్.రాజేశ్వరి రాష్ట్ర స్థాయి 600 మీటర్ల పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోవిందరెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరుపున విద్యార్థిని పాల్గొంటుందని వివరించారు.

జిల్లా స్థాయికి..

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అలసందగుత్తి జడ్పీ పాఠశాల విద్యార్థిని వెంకటేశ్వరమ్మ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని గిరిజాదేవి శనివారం తెలిపారు. ఆదోనిలో ఈ నెల 24, 25వ తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వెంకటేశ్వరమ్మ ప్రతిభ కనబరిచి అండర్-14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయిన డ్రాయింగ్ టీచర్ కీరాను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శిక్షణ ఇవ్వడంతో ప్రత్యేకంగా అభినందించారు.

చెరువంత అపరిశుభ్రత



ఆదోని పట్టణ శివారులోని మురారి చెరువు ఇది. రణమండల కొండ ప్రాంతంలో వర్షం పడినప్పుడు వచ్చే నీరు ఈ చెరువులోకి చేరుతుంది. ఇది నిండి కింది ప్రాంతంలోని రాంజల చెరువుకు నీరు వస్తాయి. నిర్వహణ లేక మురారి చెరువులో మొక్కలు ఏపుగా పెరిగి కప్పేశాయి. దీంతో చెరువు ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా చెరువులో మొక్కలను తొలగించి, నీరు కింది ప్రాంతంలోని రాంజల చెరువులోకి వెళ్లేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు. చెరువును శుభ్రం చేసి, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని రణమండల ఆంజనేయస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం**

కాలం తీరిన మందులతో ముప్పు



వివిధ వైద్యశాలలకు ప్రభుత్వం నేరుగా ఔషధాలు పంపిణీ చేస్తుంది. వాటిని సకాలంలో ఆయా రోగులకు అందించాలి. కాలం తీరిన మందులను దహనం చేసి బూడిద చేయాలి. అయితే హాలహర్వి మండలం చింతకుంట గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే కాలం తీరిన మందులను పారబోశారు. వీటితో పశువులకు, మనుషులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అయినా కొందరు ఇలా నిర్లక్ష్యంగా పారవేశారు. ప్రభుత్వ మందులను ఇక్కడ ఎందుకు పారవేయాల్సి వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. **– న్యూస్‌టుడే, హాలహర్వి**

విరాళాలు సేకరించి.. గుంతలు పూడ్చి



మద్దికెర-గుంతకల్లు ప్రధాన రహదారిపై గుంతలకు ఆటో డ్రైవర్లు మరమ్మతులు చేపట్టారు. మద్దికెరకు చెందిన కొందరు డ్రైవర్లు శనివారం విరాళాలు సేకరించి మట్టి తరలించి పొక్లెయిన్‌తో మరమ్మతులు చేయించారు. వారు స్వయంగా శ్రమదానం చేస్తూ 12 కి.మీ. మేర గుంతలు పూడ్చారు. ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఈ దారుల్లో రాకపోకలు చేయడంతో ఆటోలు పూర్తిగా దెబ్బతిన్నాయని.. పలు ప్రమాదాల బారిన పడుతున్నట్లు డ్రైవర్లు చెప్పారు. అందువల్ల తామే విరాళాలు సేకరించి మరమ్మతులు చేసుకున్నామని వారు పేర్కొన్నారు. **–న్యూస్‌టుడే, మద్దికెర**

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు అలీమ్ సిద్ధిఖీ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ప్రసాద్, సుధాకర్, జాన్ విక్టర్ రాజు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ఏర్పాట్లు పూర్తి

హొళగుంద, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎల్లార్తి సర్పంచి చాముండేశ్వరి శనివారం తెలిపారు. ఉరుసు సందర్భంగా విద్యుత్తు దీపాలతో దర్గాలను అలంకరించారు. నేడు గంధం, 30న ఉరుసు, అక్టోబర్ 1న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



విద్యుత్ దీపాలంకరణలో షాషావలి దర్గా



మొక్కలు నాటుతున్న పురపాలక అధికారులు

పచ్చదనాన్ని పెంపొందించాలి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: మొక్కలను పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని పురపాలక కమిషనర్ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్జీవోస్ కాలనీలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుకుందామని పురపాలక కమిషనర్ కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పురపాలక మైదానంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ నిర్మూలనపై శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ డా.అనుపమ, పురపాలక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండిగిరిలో స్వచ్ఛతాహి సేవ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో నూర్జహాన్ సూచించారు. ఆదోని మండలం మండిగిరి పంచాయతీలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. జడ్పీ పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె వీధులను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీధులను శుభ్రం చేస్తున్న డీఎల్‌పీవో నూర్జహాన్ తదితరులు

దసరా నాటికి గృహ ప్రవేశాలు చేద్దాం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: దసరా నాటికి గృహ ప్రవేశాలు చేద్దామని ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. స్థానిక పురపాలక కౌన్సిల్ హాల్‌లో టిడ్కో గృహాల లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 4,700 ఇళ్లలో 2 వేల ఇళ్లు పూర్తి చేసి తాళాలిచ్చామని, గృహ ప్రవేశాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. లబ్ధిదారులు పలు సమస్యలను అధికారుల ఎదుట లేవనెత్తారు. స్పందించిన అధికారులు మౌలిక వసతులు, రవాణ, ఆస్పత్రి తదితరాలు ఏర్పాటుస్తామని ఇళ్లలోకి చేరాలని సూచించారు. అవసరమైతే తాను కూడా టిడ్కో ఇంట్లో గృహ ప్రవేశం చేసి మీతో కొన్నాళ్లు అక్కడే ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పురపాలక ఛైర్‌పర్సన్ శాంత, కమిషనర్ కృష్ణ, సహాయ కమిషనర్ డా.అనుపమ, ఎంఈ ఇంతియాజ్ అలీ పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేసుకోవాలి

హొళగుంద, న్యూస్‌టుడే: సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ నరేంద్రవర్మ సూచించారు. హొళగుందలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మార్చి 30లోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాన్నారు. ఎంపీడీవో సుహాసినమ్మ, ప్రత్యేకాధికారి డీఎల్‌డీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి గృహం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటిని మంజూరు చేసి సొంతింటి కల నిజం చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని తెదేపా ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్, డీఈ ఆదినారాయణ పేర్కొన్నారు. ఆలూరు సచివాయం-2లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పీఎంఏవై ఫేజ్-1 డిసెంబర్ 2024తో గడువు ముగుస్తుందని లబ్ధిదారులు త్వరితగతిన వారికి మంజూరు చేసి ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. మార్చి 2025 తర్వాత గృహాలను పూర్తి చేసుకున్న లబ్ధిదారులు వారి సొంత ఖర్చులతో ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఎంపీడీవో అల్లాబకాష్, మండల కన్వీనరు అశోక్‌యాదవ్, తెదేపా నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

హాలహర్వి, న్యూస్‌టుడే: వాటర్‌షెడ్ ప్రాజెక్టును అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు పీవో వలీబేగ్ సూచించారు. మాచనూరులో నూతన గ్రామ కమిటీ శనివారం ఎన్నుకున్నారు.

పల్లె కబుర్లు

రాతన(తుగ్గలి), న్యూస్‌టుడే: రాతనలో బ్రహ్మయ్య స్వామి ఆరాధనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకొన్నారు. రెండు రోజులు పాటు ఈ ఉత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పట్టణంలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం సముద్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని మల్లెపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు వెల్దుర్తికి చెందిన మల్లికార్జున నాయుడు, పారిశ్రామికవేత్త సాయిప్రసాద్ చేతుల మీదుగా ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: కుంకనూరులో శనివారం దినసరి కూరగాయల మార్కెట్ వేలాలు నిర్వహించారు. శ్రీనివాసులు రూ.8.70 లక్షలకు కూరగాయాల మార్కెట్ దక్కించుకున్నట్లు ఈవోఆర్డీ సూర్యనారాయణ తెలిపారు.

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: పెరవలిలో ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ శనివారం తెలిపారు. రహదారికి అడ్డుగా ఉన్న ఇళ్లను, ఆక్రమణలు, నిర్మాణాలను తొలగించారు. పొక్లెయిన్ సాయంతో స్థానిక బస్టాండు నుంచి ఇరువైపుల తొలగింపు పనులు చేపట్టారు.

పాదచారులకు దారేది



అంబేడ్కర్ కూడలి వెనుక భాగంలో..

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రధాన రహదారుల్లో పాదచారుల నడకదారులు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఆదోని పురపాలక సంఘం ఆవిర్భావం రెండోది. 150 ఏళ్ల చరిత్ర ఉంది. పట్టణంలో ఉన్న ఫుట్‌పాత్‌లను కాపాడుకోలేక ఆన్యాక్రాంతం అయ్యేలా చేశారు. ప్రస్తుతం పట్టణంతో పాటు ట్రాఫిక్ సమస్య పెరిగింది. దీంతో ప్రజలు వాహనాల మధ్యనే ఇరుకైన దారుల్లో నడక సాగించాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

☛ పట్టణంలో రహదారుల విస్తరణ అంశం గాలికి వదిలేశారు. కనీసం ఆక్రమణల తొలగింపుతోనైనా, పాదచారులకు కొంత చోటు దక్కుతుందని అంతా భావిస్తున్నారు. గంటల కొద్ది ట్రాఫిక్‌లో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పట్టణం:	ఆదోని
వార్డులు:	42
ప్రధాన రహదారులు:	12
వాటి పొడవు:	18-20 కి.మీ.
నిత్యం తిరిగే వాహనాలు:	35 వేలు
ఆదోనికి వచ్చే ప్రజలు:	40 వేలు

☛ పట్టణంలో పురపాలక ప్రధాన రహదారి, తానాజీ, పండిట్ నెహ్రూ, బంగారు బజారు, బీఎన్ టాకీస్, చిన్న మార్కెట్, పూల బజారు, సట్టా బజారు, ఎమ్మిగనూరు రహదారి, కొత్త బస్టాండు రహదారి, కంచిగారి వీధి తదితర ప్రధాన వాణిజ్య ప్రాంతాలున్నాయి. ఇక్కడి రహదారుల్లో గతంలో ఫుట్‌పాత్‌లుండేవి. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి. ఇక జేఎల్‌బీ మార్కెట్లో తాజాగా వేసిన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. సైకిల్ స్టాండు నిర్వహణ వల్ల వాహనాలు అడ్డుగా మారి జనాన్నికి మరింత ఇబ్బందులు తప్పడం లేదు. బంగారు బజారు నిత్యం వందల మందితో రద్దీగా ఉంటుంది. ఇక్కడి ప్రాంత రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోవడంతో రాకపోకలకు స్తంభించిపోతున్నాయి. హవన్నపేట ప్రాంత రహదారి కేవలం పది నుంచి పన్నెండు అడుగుల వెడల్పు కారణంగా ఆటో వస్తే ఎక్కడికక్కడా ఆగిపోతాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి కోట్ల కూడలి మీదుగా ఎమ్మిగనూరు, కొత్త బస్టాండు రహదారుల వరకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లుండేవి, నేడు అవి కనిపించకుండా పోయాయి. పాత ఆకాశవంతెనపై ఇరువైపుల పాదాచారులకు స్థలాలున్నా, శిథిలావస్థకు చేరుకున్నాయి.



బంగారు బజారులో రహదారిపై నిలిపిన వాహనాలు

ప్రతిఒక్కరికి లక్ష్యం అవసరం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు తగినట్లుగా సాధన చేసి విజయం సాధించాలని ఆదోనికి చెందిన శిక్షణ ఐఏఎస్ అధికారి సమీర్‌రాజ్ సూచించారు. పట్టణంలోని విశ్వనారాయణ జూనియర్, ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్రాంత తహసీల్దారు షేక్షావలి, ప్రిన్సిపల్ మల్లికార్జున, ఉసేనప్ప పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన కల్పించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఆలూరు ఏడీఏ సునీత, సూచించారు. ఆలూరు మండల పరిషత్తు సమావేశ భవనంలో ఐదు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పంటలకు ఏ మందులు పిచికారి చేయాలో పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటేనే రైతులకు చెప్పవచ్చని పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర, జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అడిగిన సమాచారం ఇవ్వండి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు, రైతులు ఇతరలు దరఖాస్తు చేసుకుంటే వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత సూచించారు. ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారులకు, రైతు సేవ కేంద్ర సిబ్బందికి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆలూరు ఏవో వెంకటేశ్వరగౌడ్, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు


ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థినులతో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా.. ర్యాగింగ్ చేసినా వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు పేర్కొన్నారు. ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాలు తదితరాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంజన్న, ఏఎస్సై లక్ష్మన్న, ఎన్‌సీసీ అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

నేడు గ్రాండ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నేడు(ఆదివారం) గ్రాండ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ ఉమ్మడి జిల్లా మీట్ నిర్వహించనున్నట్లు ఆ సంఘ పెద్దలు రాచోటి సుధాకర్, మిరియాల బద్రి, ఖాజా బందే నవాజ్, నసీరుద్దీన్ పటేల్ శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు జరిగే సమావేశంలో 100, 800 మీటర్ల పరుగు, లాంగ్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్ త్రో తదితర పోటీలుంటాయన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మాస్టర్స్ క్రీడాకారులు హజరు కానున్నట్లు పేర్కొన్నారు.



హొళగుంద: భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



పత్తికొండ పట్టణం: నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పోరాట యోధుడు భగత్‌సింగ్



ఆలూరు: నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, అధ్యాపకులు

పోరాట యోధుడు భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. వెల్దుర్తిలో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి సమాజలో విద్యార్థి పాత్ర అంశంపై సెమినార్ నిర్వహించారు. **–న్యూస్‌టుడే బృందం**



దేవనకొండ: బహుమతులు ప్రదానం చేస్తున్న తహసీల్దార్ లోకేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌శర్మ



ఆదోని గ్రామీణం: పెద్దతుంబళం నేషనల్ పాఠశాలలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రాఘవేంద్రుడి నిజ బృందావన దర్శనం



మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశి పురస్కరించుకొని శనివారం శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఇవ్వడంతో స్వామివారు నిజ బృందావన రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి నిర్మాల్యం మాత్రమే చేసి కాషాయ వస్త్రాలు, తులసీ మాలతో బృందావనాన్ని అలంకరించి హారతి సమర్పించారు. ఆదివారం ద్వాదశి నుంచి నిత్య పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు భక్తులకు ఊంజల మంటపంలో తప్తముద్రాధారణ చేసి ఆశీర్వదించారు.

← నిజ బృందావన రూపంలో స్వామివారు

శ్రీమఠంలో బళ్లారి ఎస్పీ

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటకలోని బళ్లారి జిల్లా ఎస్పీ శోభారాణి కుటుంబ సభ్యులతో కలసి శనివారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. వారికి మఠం సహాయ మేనేజర్ నరసింహామూర్తి, సహాయ పీఆర్వో బిందుమాధవ్ స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామదేవత మంచాలమ్మను, అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనం దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు వారిని ఆశీర్వదించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు, సమస్య: మండలంలోని బాపులదొడ్డిలో చాలా రోజులుగా మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. **- గ్రామస్థులు**

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
- జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

ఎమ్మిగనూరు గ్రామీణం, సమస్య: మండలంలోని గార్లదిన్నె నుంచి అల్వాల నీటి పథకం ద్వారా శుద్ధి చేయకుండా నీటి సరఫరా చేస్తుండటంతో తాగునీరు కలుషితంగా ఉంటుంది. **- తిమ్మగురుడు, గార్లదిన్నె**

సమాధానం: తాగునీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తాం.
- ప్రేమ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎమ్మిగనూరు

ఎల్లెల్సీ డీఈగా బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువ కాల్వ డీఈగా విద్యాసాగర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆర్డీఎస్ ప్రాజెక్టు డీఈగా పనిచేస్తూ బదిలీపై ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయనకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఈ మణికంఠ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీఈగా బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్‌కు మొక్క ఇచ్చిన పలికిన సిబ్బంది

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

సి.బెళగల్, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ప్రత్యేకాధికారి శ్యామల పేర్కొన్నారు. సి.బెళగల్‌లో ఏవో [illegible] అధ్యక్షతన శనివారం స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, మండల గణాంకాధికారి ఆదినారాయణ, ఈవోఆర్డీ సందీప్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో న్యాయవాది ప్రతిభ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యారమ్ పోటీల్లో ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ నుంచి సింగిల్స్ విభాగంలో రామకృష్ణనాయుడు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడి ప్రతిభపై అభినందించారు.

గోదాముల కొరత.. ఉల్లి రైతు వ్యథ

☛ పంట నిల్వకు తప్పని అవస్థలు

వ్యవసాయరంగం అభివృద్ధికి వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు పూర్తిస్థాయిలో విఫలం కావడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది ఉల్లికి అధిక ధర లభించడంతో రబీలో సాగు పెరగనుంది. కానీ పంట నిల్వకు గోదాముల సౌకర్యం లేకపోవడంతో నష్టాలకు విక్రయించే పరిస్థితి తలెత్తనుందని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోదాముల నిర్మాణం చేపట్టాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలో దాదాపు 800 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. ఏటా ఒకటి లేదా రెండెకరాల్లో ఉల్లి సాగు చేస్తాం. గిట్టుబాటు ధరలు లేని సమయంలో పంట నిల్వకు గోదాముల సౌకర్యం లేకపోవడంతో నష్టాలకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు మండలంలో ఉల్లి గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని హనుమాపురం గ్రామానికి చెందిన రైతు ఈరమ్మ కోరుతున్నారు.



పొలాల్లో ఆరబెట్టిన ఉల్లి

రాయితీ కింద నిర్మాణం

బ్రాహ్మణదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణదొడ్డికి చెందిన రైతు టి.మౌలాళి 2017-18లో ఉద్యాన శాఖ పర్యవేక్షణలో రూ.1,90,000 ఖర్చుతో పొలంలో ఉల్లి గోదాం నిర్మించారు. రాయితీ కింద రూ.80 వేలు వచ్చింది. ప్రస్తుతం ఎకరా ఉల్లి సాగు చేశారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేని సమయంలో పంటను గోదాములో నిల్వ చేసుకుని గిట్టుబాటు ధరల సమయంలో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో దాదాపు 3,120 మంది రైతులు 3,864 ఎకరాల్లో ఉల్లి సాగు చేపట్టారు.



బ్రాహ్మణ దొడ్డిలో ..

మందుబాబులకు అడ్డా

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో 746 మంది రైతులు 834 ఎకరాల్లో ఉల్లి సాగు చేపట్టారు. మండల కేంద్రంలోని తూర్పు బీసీ కాలనీ సమీపంలో మార్కెట్ యార్డు స్థలంలో తొమ్మిదేళ్ల కిందట సుమారు రూ.40 లక్షలతో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రెండు గోదాములు నిర్మించారు. ఉల్లికి ధర లేని సమయంలో కొందరు అన్నదాతలు పంట దిగుబడులను ఈ గోదాముల్లో నిల్వ చేసుకునేవారు. వైకాపా హయాంలో వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి మందుబాబులకు అడ్డాగా మారినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



పిచ్చి మొక్కలతో గోదాము

శిథిలావస్థకు చేరి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో 1,200 మంది అన్నదాతలు దాదాపు 2 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేపట్టారు. 25 టన్నుల సామర్థ్యం గోదాములను గోనెగండ్ల, పెద్దనెలటూరు, ఎర్రబాడు గ్రామాల్లో 2009, 2014 సంవత్సరాల్లో రాయితీ కింద ఉల్లి గోదాములు మంజూరు చేశారు. గోనెగండ్లలోని రైతు షేక్‌హుస్సేన్ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీ కింద సుమారు ఎనిమిదేళ్ల కిందట 50 టన్నుల గోదాము నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వైకాపా హయాంలో ఒక రైతుకు కూడా ఉల్లి గోదాములు మంజూరు చేయలేదు.



ఎర్రబాడులో..

పొలాల్లోనే ఆరబెట్టుకుంటున్న రైతులు

కోసిగి, న్యూస్‌టుడే: మండలంలో 700 మంది రైతులు 1,200 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. పంటకు గిట్టుబాటు ధర ఉండటంతో మరింతగా ఉల్లి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గిట్టుబాటు ధరలు లేని సమయంలో గానీ, వర్షాకాలంలో గానీ పంట నిల్వ ఉంచుకునేందుకు గోదాములు లేకపోవడంతో అనేక సందర్భాల్లో వర్షానికి పంట తడిచి తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలయ్యామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది

స్వచ్ఛ ఎమ్మిగనూరుకు సహకరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ ఎమ్మిగనూరుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి కోరారు. నగరంలోని మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా శనివారం ర్యాలీ చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, మురుగు కుంటలు, కాల్వల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాల్వలో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు ప్రభుత్వం దాదాపు రూ.70 లక్షల మంజూరు చేసిందని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛత హి సేవ అక్షరాల రూపంలో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో డీఈ నీరజా, ఏఈ మదన్, వ్యాయామ ఉపాధ్యాయులు సృజనకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

4,709 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేశుల జలాశయం నుంచి తుంగభద్ర నది దిగువకు 4,709 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీరు రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పల్లె కబుర్లు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు, తెదేపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని వైకాపా నియోజకవర్గ నాయకుడు బుట్టా ప్రతూల్ పేర్కొన్నారు. నాయకులతో కలిసి వెంకటసాయి దేవాలయంలో వెంకటేశ్వరస్వామికి శనివారం పూజలు నిర్వహించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై సీఎం చంద్రబాబు రాజకీయాలు తగవని జడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి, నాయకుడు రమేశ్‌నాయుడు శనివారం పేర్కొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గోరంట్ల లక్ష్మీమాధవస్వామి క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు శనివారం అభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని వాణిజ్య దుకాణాలను కమిషనర్ నాగరాజు శనివారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తే దుకాణ అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ శనివారం కోరారు. మండల కార్యదర్శి ఈరన్న, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: డిక్లరేషన్ ఇచ్చేందుకు ఇష్టం లేక మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన వాయిదా వేసుకున్నారని భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్‌నాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తెదేపాను విమర్శించే అర్హత పురపాలక వైస్ ఛైర్మన్ నజీర్‌అహ్మద్‌కు లేదని తెదేపా నాయకుడు కౌన్సిలర్ ఇసాక్ శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు టీపోడి ప్రతాప్‌రెడ్డి, బందేనవాజ్ పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కుక్కకాటుకు రేబీస్ టీకా వేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మదన్ తెలిపారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా శనివారం ర్యాలీని డివిజనల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్కతో కలిసి ప్రారంభించారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: కంది పంటలో మారుకా మచ్చల పురుగు బెడద నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ రైతులకు సూచించారు. మండలంలోని కైరవాడిలో కంది పంటను శనివారం పరిశీలించి మాట్లాడారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: బాపులదొడ్డిలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని వైకాపా నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ఎస్సై నిరంజన్‌రెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: క్రిష్ణదొడ్డిలో కోన.వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోడుమూరు వైకాపా సమన్వయకర్త ఆదిమూలపు.సతీశ్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం అభిషేక పూజలు నిర్వహించారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. స్థానిక మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఈవ్‌టీజింగ్, మాదక ద్రవ్యాలపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులపై వేధింపుల తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ సుదర్శన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెండింగ్ కేసుల పరిష్కారం

మంత్రాలయం, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు పోలీసులకు సూచించారు. మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను పరిష్కరించి సత్వర న్యాయం చేయాలని సీఐ రామాంజులు, ఎస్సై పరమేశ్‌నాయక్‌లకు సూచించారు. మంత్రాలయం పవిత్రతను కాపాడేందుకు మాంసం విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. వసతి గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు.

మరోసారి ఘర్షణకు పాల్పడితే చర్యలు తప్పవు

కోసిగి, న్యూస్‌టుడే: మండలంలోని కందుకూరులో ఈ నెల 23న గ్రామానికి చెందిన భీమేశ్‌తో పాటు ఆరుగురు, కౌతాళం మండలం తిప్పలదొడ్డికి చెందిన మల్లయ్యతో పాటు మరో ఎనిమిది మంది అక్రమ మద్యం తరలించే విషయంలో ఘర్షణ పడిన సంగతి తెలిసిందే. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మంజూనాథ్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఇరువర్గాలకు శనివారం రెండోసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. మరోసారి ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తప్పులు చేయమని వారిని కోసిగి తహసీల్దార్ నిత్యానందరాజ్ వద్దకు తీసుకెళ్లి హామీ పత్రం అందజేసి బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. మరోవైపు కందుకూరుకు చెందిన ఏడుగురు పాత మద్యం విక్రయదారులకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఏఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ మంజూనాథ్, ఎస్సై చంద్రమోహన్

ఇసుక వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

కె.శింగవరం (సి.బెళగల్), న్యూసుటుడే: మండలంలోని తుంగభద్ర నదీతీరాన కొత్తకోట, కె.శింగవరం గ్రామాల్లోని ఇసుక రీచుల నుంచి గనుల శాఖ అధికారులు, వీఆర్వోలు, సచివాలయాల సిబ్బంది సమక్షంలో ఇసుకను ట్రక్కుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈనెల 19 నుంచి అంతర్జాల సమస్యతో అనుమతి పొందేందుకు వీలు లేకుండాపోయింది. వీఆర్వోలు ఉదయం సుమారు 2గంటలు ఆలస్యంగా రావడంతో వాహనాలు అధిక సంఖ్యలో రహదారిపై సుమారు 2 కి.మీ.ల మేర నిలిచి పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అధికారుల అనుమతితో చెట్ల కొమ్మల తొలగింపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కోతులు, పక్షుల బెడదతో పంటలు నష్టపోతున్నందున అధికారుల అనుమతితో చెట్ల కొమ్మలు తొలగించినట్లు బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

తెదేపా నేతకు రైతుల సన్మానం

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: తెదేపా నేత రాఘవేంద్రరెడ్డి ఆయన సోదరుడు రామకృష్ణారెడ్డిలకు మంత్రాలయం రైతులు శాలువా పూలమాలతో సన్మానించారు.



రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డిలని సన్మానిస్తున్న రైతులు

మాధవరంలోని ఆయన స్వగృహంలో మండల, పట్టణ తెదేపా అధ్యక్షుడు వరదరాజు ఆధ్వర్యంలో రైతులు రాఘవేంద్రరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టైగర్ రఘు, మేకల నరసింహులు, శివ పాల్గొన్నారు.

దేవుడి సొమ్ము దోచుకునేందుకే కల్తీ

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: కోట్లాది రూపాయల దేవుడి సొమ్మును దోచుకునేందుకే వైకాపా నేతలు శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసి పాపం మూట కట్టుకున్నారని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా నేత రాఘవేంద్రరెడ్డి ఆరోపించారు. మండలంలోని మాధవరంలోని ఆయన నివాసంలో శనివారం మాట్లాడుతూ.. తిరుమలలో జరిగిన అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి త్వరలో శిక్ష తప్పదని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. జీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హెచ్‌ఎం తైమూర్ బాషా, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

పతకం సాధించడం గర్వకారణం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాల విద్యార్థిని రూపకల్యాణి (బీఏ) ఉత్తమ మార్కులు సాధించి స్వర్ణ పతకం సాధించడం కళాశాలకు గర్వకారణమని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఆదోనిలో లక్ష్మమ్మ అవ్వ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బహుమతి అందజేసినట్లు తెలిపారు. కళాశాల సూపరింటెండెంట్ మద్దిలేటి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు నడపాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సకాలంలో బస్సులు నడపాలని మండలంలోని సిరాల దొడ్డి గ్రామానికి చెందిన విద్యార్థులు కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆర్టీసీ అధికారులకు శనివారం తమ సమస్యలు విన్నవించారు. బస్సులు ఆలస్యంగా వస్తుండటంతో నిత్యం పాఠశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. పలుమార్లు సమస్యను పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి సమస్యలు విన్నవిస్తున్న విద్యార్థులు

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కంబదహాల్ (సి.బెళగల్), న్యూస్‌టుడే: అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను డిసెంబరులోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్యామల సూచించారు. మండలంలోని కంబదహాల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లో నిర్వహించిన 'మన ఇల్లు- మన గౌరవం' లో భాగంగా ఆయా గ్రామాల సర్పంచులు రామాంజినేయులు, ఈరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు.

కె.నాగలాపురం, గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురంలో 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహసీల్దార్ కె.రామాంజనేయులు, ఎంపీడీవో విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకున్నవారికి బిల్లులు మంజూరు చేస్తామని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య తెలిపారు. మంత్రాలయంలో ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు వరదరాజులు, సీనియర్ నాయకుడు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ప్యాలకుర్తి, గోరంట్ల గ్రామాల్లో శనివారం నిర్వహించిన మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో మాట్లాడారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం సాయిబాబాను పల్లకిలో ఉంచి ఊరేగించారు.

జూదర్ల అరెస్టు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: స్థానికుల సమాచారం మేరకు చింతలాముని స్వామి ఆలయం సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మసీదుపురానికి చెందిన వీరేశ్ పొలం వద్ద శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

పందుల దొంగల బీభత్సం

మంత్రాలయం, న్యూస్‌టుడే: పందుల దొంగలు శుక్రవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. స్థానికుల వివరాల మేరకు.. తలకు మాస్కులతో వచ్చిన నలుగురు దొంగలు అర్ధరాత్రి నాగలదిన్నె రోడ్డు నుంచి సంతమార్కెట్ మీదుగా పంచాయతీ కార్యాలయం నుంచి నదీ తీరంలో ఉన్న పందులను అపహరించి బొలేరో వాహనంలో తరలిస్తుండగా పంచాయతీ కార్యాలయం వద్ద పందుల కాపరులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. దీంతో దొంగలు వాహనంలో నుంచి బీరు, సోడా సీసాలతో ఎదురుదాడి చేశారు. తీవ్రమైన శబ్దాలకు అక్కడికి వచ్చిన కొందరు స్థానికులపై దాడులు చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంబడించడంతో పారిపోయారని, దొంగల కోసం గాలింపు చేపట్టినట్లు సీఐ రామాంజులు, ఎస్సై పరమేశ్‌నాయక్‌లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు మండలం ఉల్చాలకు చెందిన గడ్డం నాయుడు కారులో 15 పెట్టెల్లో రూ.64,500 (1,440 టెట్రా ప్యాకెట్లు) విలువ చేసే కర్ణాటక మద్యం తరలిస్తుండగా కోడుమూరు పెట్రోల్ బంకు సమీపంలో అబ్కారీ జిల్లా అధికారి సుధీర్ బాబు, జిల్లా సహాయ అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుడితో పాటు కారు యజమాని జి.సింగవరానికి చెందిన ఉపేంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

భగత్‌సింగ్ సేవలు స్ఫూర్తిదాయకం

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: ప్రతిభ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాల హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, కళాశాల ప్రధానాచార్యుడు సంతోశ్‌కుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సీపీఐ నాయకుడు రంగన్న ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. నాయకులు విజేంద్ర, రాజీవ్, షమీవుల్లా రాజీవ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల కార్యదర్శి మోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కల్లుకుంటలో సీపీఐ నాయకులు శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మోహినుద్దీన్, ప్రిన్సిపల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగు.. రాయితీ విత్తనాల పంపిణీ

◆ వ్యవసాయ ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వచ్చే నెల (అక్టోబరు) 1వ తేదీ నుంచి రబీ సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యంలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురవడంతో చెరువులు, జలాశయాలు, తుంగభద్ర నది నీటితో జలకళ సంతరించుకున్నాయి. రబీలో రైతులకు అందించే రాయితీ విత్తనాలు, రాయితీ యాంత్రీకరణ పరికరాలపై వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి.

ముఖాముఖి



నిర్ణీత ధరలకు ఎరువుల విక్రయం

రబీలో ఉప విభాగం పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో 9,551 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం. ఇందులో మొక్కజొన్న 1,362, వేరుశనగ 1,263, శనగ 533 హెక్టార్లతో పాటు ఇతర పంటలు సాగు చేయనున్నట్లు అంచనా. రబీలో శనగ విత్తనాలు రాయితీపై అందించనున్నాం. ప్రస్తుతం 2,500 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 270 టన్నుల యూరియా, 250 టన్నుల డీఏపీ అందుబాటులో ఉంది. రైతులకు నిర్ణీత ధరలకు విక్రయించాలని వ్యాపారులకు ఆదేశాలు ఇచ్చాం.

బయోమందులు విక్రయిస్తే చర్యలు

ఉప విభాగం పరిధిలో వ్యాపారులు అనుమతి లేని బయోమందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ నేపథ్యంలో పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి అనుమతి లేని బయోమందులు విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు ఎలాంటి పంట నష్టం జరగలేదు. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. నాలుగు మండలాల్లో ప్రతి మంగళ, బుధవారాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తూ రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నాం. వ్యవసాయశాఖతో పాటు ఉద్యాన, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ శాఖ, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సమన్వయంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రైతులు ఆయా పంటల్లో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పశువులు, జీవాల్లో వచ్చే వ్యాధుల నివారణ చర్యలు తెలియజేస్తున్నాం. ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. వ్యవసాయ అనుబంధశాఖల అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి అధిక దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలు తెలియజేస్తున్నాం.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

ఉప విభాగం పరిధిలో యాంత్రీకరణలో భాగంగా రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ట్రాక్టరు యంత్ర ఉపకరణాలకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. రైతులు వివిధ పంటల్లో చీడపీడల నివారణ, ఎరువుల వినియోగం వంటి అంశాలను గ్రామాల్లో అందుబాటులో ఉన్న వీఏఏలను కలిసి సలహాలు, సూచనలు పాటించడం ద్వారా పంటలను రక్షించుకోవచ్చు.

కర్నూలు
•కర్నూలు •పాణ్యం

రేబిస్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రేబిస్



మాట్లాడుతున్న ఏడీ డా.రవిబాబు

వ్యాధిపై అప్రమత్తత అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డా.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం బహుళార్థ పశు వైద్యశాలలో ప్రపంచ రేబిస్ నివారణ దినం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. 2030లోగా రేబిస్ వ్యాధి రాకుండా అరికట్టేందుకు ప్రణాళికలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా రేబిస్ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. బహుళార్థ పశువైద్యశాల డీడీ డా. హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప సీఈ బాధ్యతల స్వీకరణ

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ కర్నూలు సీఈ కార్యాలయం ఉప సీఈ బి.రాజేంద్ర ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సార్బీసీ-1 సర్కిల్ (నంద్యాల) ఉప ఎస్‌ఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని కర్నూలు సీఈ కార్యాలయానికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన రాజేంద్రకు సీఈ కబీర్ బాషా, ఇంజినీర్లు, కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: సమస్య: అశోక్‌నగర్‌లోని వీధుల్లో కాల్వలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – స్థానికులు

సమస్య: కృష్ణానగర్, శరీన్‌నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. – స్థానికులు

సమాధానం: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. – నగర పాలక అధికారులు

భగవద్గీతకు ప్రచారం అవసరం


డీవీ రమణ దంపతులను సన్మానిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా భగవద్గీతను మరింత ప్రచారంలోకి తీసుకురావాలని, ఈ మేరకు హిందూ ధార్మిక సంస్థలు కృషి చేయాలని చిన్మయ మిషన్‌కు చెందిన సుప్రేమానంద అన్నారు. కర్నూలు సంకల్‌బాగ్‌లోని గీతాధామంలో శనివారం గీతా ప్రచార సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ రమణ దంపతులను సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రేమానంద మాట్లాడుతూ.. సమాజంలో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏకాదశి రోజు భగవద్గీత పారాయణం చేయాలన్నారు. అనంతరం డీవీ రమణ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సందిరెడ్డి సాయిరెడ్డి, గోదా గోకులం అధ్యక్షుడు మారం నాగరాజు, తితిదే ప్రతినిధి మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భక్తి ఉంటే జగన్ డిక్లరేషన్ ఎందుకివ్వరు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేంకటేశ్వర స్వామిపై భక్తి ఉంటే సంప్రదాయాలకు అనుగుణంగా డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదని తెదేపా కర్నూలు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు ప్రశ్నించారు. శనివారం ఆయన తెదేపా జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. జగన్ తిరుమల పర్యటన రద్దుతో మొత్తం ఆయన తీరు దేశ ప్రజలందరికీ బాగా అర్థమైందన్నారు. తెదేపా నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోర్టులో వసతులు ప్రారంభం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ఆవరణలో నాలుగు చోట్ల తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి సామాజిక బాధ్యత చాటుకున్న కెనరా బ్యాంకు ప్రతినిధులను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అభినందించారు. శనివారం కోర్టు ఆవరణలో తాగునీటి సౌకర్యం, దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ర్యాంపులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు, డివిజనల్ మేనేజర్ సురేష్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె. మన్మథరావు శనివారం కర్నూలుకు వచ్చేశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జి.బిందుమాధవ్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

బాండ్లు కట్టబెట్టి.. రూ.కోట్లు కూడబెట్టి

☛ నగర పాలకలో టీడీఆర్ జారీలో అక్రమాలు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్‌లను జారీ చేశారు. బిల్డర్లు, స్థిరాస్తి వ్యాపారులకు ఇష్టానుసారంగా ఇచ్చేశారు. వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అక్రమంగా జారీ చేసిన బాండ్లపై విచారణలు వెల్లువెత్తాయి. ఐదేళ్ల కాలంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై పూర్తిగా విచారించాలని పురపాలక శాఖ మంత్రి అన్ని పురపాలికలు, నగర పాలక సంస్థలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలో విజిలెన్సు అధికారులు ఆరా తీసి వివరాలు సేకరించారు.

కర్నూలు నగరంలో 52 వార్డులు, సుమారు 6.5 లక్షల జనాభా ఉంది. నగరంలో 12 ప్రధానమైన రహదారులు బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)లో ఉన్నాయి. అయితే ఎప్పుడు విస్తరిస్తారో స్పష్టమైన ఉత్తర్వులు లేవు. విస్తరణ చేస్తారో లేదో కూడా తెలియదు. ప్రణాళిక పరిధిలో ఉన్నాయనే కారణం చూపి నిబంధనలకు విరుద్ధంగా కర్నూలు నగర పాలకలో గత ఐదేళ్ల కాలంలో 135 బాండ్లు జారీ చేశారు. ఇందులో పాలక వర్గం ఏర్పడ్డ తర్వాతే అత్యధికంగా జారీ చేయడం విశేషం. వైకాపా ప్రభుత్వంలో నేతలు, అధికారులు కుమ్మక్కై టీడీఆర్ పేరిట నగర పాలక ఆదాయానికి గండికొట్టారు. ఇష్టానుసారంగా బాండ్లను జారీ చేసి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. వైకాపా నేతల కనుసన్నల్లో రియల్టర్లకు, నగర పరిధిలో ఓ ట్రస్టుకు బాండ్లను ఇప్పించారనే ఆరోపణలున్నాయి. కాసులకు కక్కుర్తి పడి బఫర్ జోన్‌లో సైతం రూ.కోట్ల విలువ చేసే టీడీఆర్ బాండ్లను ఇచ్చారని తెలుస్తోంది. గత కొన్ని నెలల కిందట నగర పాలక పరిధిలో అసలు ఎన్ని టీడీఆర్‌లు జారీ చేశారనే సమాచారాన్ని అడగ్గా.. తమ వద్ద లేదని నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెప్పడం గమనార్హం.

విజిలెన్స్ అధికారుల ఆరా

కర్నూలు నగర పాలక పరిధిలో అధికారులు విచ్చలవిడిగా జారీ చేసిన టీడీఆర్‌లపై ఇటీవల విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కలిసి ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. గత ఐదేళ్ల కాలంలో నగరంలో జారీ చేసిన బాండ్ల వివరాలను అధికారులకు అందించినట్లు పట్టణ ప్రణాళిక అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే జారీ చేసిన బాండ్లలో ఏమేర అక్రమాలు జరిగాయి నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని బాండ్లు ఇచ్చారు అని నిగ్గు తేల్చాల్సి ఉంది. నేతల మాటలు విని నగర పాలక అధికారులు అత్యుత్సాహంతో అక్రమంగా బాండ్లు జారీ చేశారని నగర పాలకలో చర్చించుకుంటున్నారు.

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం విద్యుత్తు బిల్లు చెల్లింపు కేంద్రాలు తెరుచుకుంటాయని సీనియర్ అకౌంట్స్ అధికారి చిన్న రాఘవులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్ పరిధిలోని విద్యుత్తు బిల్లు చెల్లింపు కేంద్రాలు పని చేస్తాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి కోరారు.

నేటి నుంచి సీబీఎస్ఈ రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు నగర శివారులోని రిడ్జి అంతర్జాతీయ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి అక్టోబరు 2 వరకు సీబీఎస్ఈ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల జోన్ 7 క్లస్టర్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రిడ్జి పాఠశాల సీఈవో గోపినాథ్, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మోహన్‌కుమార్, రవీంద్ర గ్లోబల్ పాఠశాల సీఈవో వంశీధర్ తెలిపారు. కృష్ణా నగర్‌లోని రవీంద్ర పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీలు అండర్-14, 17, 19 బాలుర విభాగం కోసం మూడు మైదానాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. 150 పాఠశాలల నుంచి 3 వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని, రిడ్జి పాఠశాలలోనే అన్ని వసతులు, భోజన సౌకర్యం కల్పించామన్నారు. విద్యా సంస్థల ప్రిన్సిపల్ రాజ్‌కమల్, పోటీల నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రన్ పాల్గొన్నారు.

పోషకాలతో ఆరోగ్యం పదిలం



కార్యక్రమానికి హాజరైన ఎంపీ నాగరాజు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీ నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని శ్రీలక్ష్మి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఎంపీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవి లత, డైరెక్టర్ దీక్షిత్ పాల్గొన్నారు.

విజయంతో ఆత్మవిశ్వాసం


క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: పోటీల్లో విజయం క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడా పోటీల అధ్యక్షుడు వై.పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ అండర్-19 సెపక్‌తక్రా, కరాటే పోటీలను కార్యదర్శి హర్షవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకుడు ఫయాజ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల రగ్బీ, జిమ్నాస్టిక్స్, టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీలను కర్నూలు రూరల్ ఎంఈవో కె.వినోద్‌కుమార్ శనివారం ప్రారంభించారు. చదువు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు గిడ్డయ్య, హర్షవర్ధన్, క్రీడా సంఘం ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

జూడో, హ్యాండ్‌బాల్..

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నంద్యాలలోని కేవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉప విద్యాధికారి కార్యాలయం సమీపంలో జూడో అండర్-17 బాలబాలికలు, హ్యాండ్‌బాల్ అండర్-14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు, నంద్యాల డీఈవోలు శామ్యుల్, కె.సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు గిడ్డయ్య, శివకుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి


ఆర్‌యూలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని రాయలసీమ విశ్వవిద్యాలయ ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్‌యూలో భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ మౌలాలి, నాయకులు రాజు, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని బీక్యాంపులో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమణకుమార్ పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గోకారి భవన్‌లో మహాత్మా జ్యోతిబా పులె చిత్రపటానికి నివాళి అర్పించినట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.భాస్కర్, రాజు తెలిపారు.

○ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం కర్నూలు బీక్యాంపు బాలికల పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించినట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమణకుమార్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సీఆర్ భవన్‌లో భగత్‌సింగ్ జయంతి నిర్వహించినట్లు సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు లెనిన్‌బాబు, శ్రీనివాసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని నన్నూరు సమీపంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు. నన్నూరు సమీపంలోని అభి డాబా వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురికావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

15 మంది మందుబాబులపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడిపి చిక్కిన 15 మందిపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మన్సూరుద్దీన్ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి సి.క్యాంపు కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహన చోదకులను తనిఖీ చేసి 15 మంది మద్యం తాగినట్లు గుర్తించారు. 12 బైకులు, మూడు ఆటోలు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఇందిరాశాంతి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: గుర్రం జాషువా రచనలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపల్ ఇందిరాశాంతి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో జాషువా జయంతిని తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దేశం గర్వించదగిన కవి అన్నారు. జాషువా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రచయిత మోహన్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు. నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ దేవి కారాణి ఆధ్వర్యంలో జాషువా జయంతి నిర్వహించారు.

అరసం ఆధ్వర్యంలో..

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: అభ్యుదయ రచయిత సంఘం కర్నూలు నగర శాఖ ఆధ్వర్యంలో అరోరానగర్ కాలనీలోని పాఠశాలలో శనివారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. నగర కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి, ఆదవాని హనుమంతప్ప పాల్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయిని బాబక్కను సత్కరించారు.

కేసీ ఆయకట్టులో మెరుగైన ఫలితాలు సాధించాలి

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: కేసీ ఆయకట్టు పంటలకు సాగునీటిని విడుదల చేయడంలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా సీఈ కె. కబీర్ బాషా కోరారు. కేసీ కాల్వ ఈఈగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్ శనివారం సీఈని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీ ఆయకట్టు, పంటల సాగు, నిధుల ప్రతిపాదనలు, అత్యవసరమైన పనులు తదితర అంశాలపై చర్చించారు. సీఈని కలిసిన వారిలో కర్నూలు డీఈఈ వై.రఘురామిరెడ్డి, అలగనూరు డీఈఈ మోహన్‌రావు ఉన్నారు.


కర్నూలు సీఈ కబీర్ బాషాకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న కేసీసీ ఈఈ ప్రతాప్, చిత్రంలో డీఈఈ రఘురామిరెడ్డి

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి: పీడీ

కర్నూలు సచివాలయం: పీఎంఏవైలోని ఇళ్ల నిర్మాణాలను వచ్చే మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి ఆదేశించారు. శనివారం ముజఫర్ నగర్‌లోని వార్డు సచివాలయ ఉద్యోగులు, పీఎంఏవై ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

గంజాయి సాగు సమాచారం ఇవ్వండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నారని తమ దృష్టికి వస్తే వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం జిల్లా ఉద్యాన భవన్‌లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు డివిజన్ రైతు సేవా సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాతమ్మ, ఏపీఎంఐపీ ఏపీడీ రామకృష్ణారెడ్డి, ఉద్యాన అధికారి మదన్, కర్నూలు ఏడీఏ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే గుర్తింపు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: వార్డుల్లో రోగులకు వైద్యసేవలందించడంలో నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది సమన్వయంతో పని చేసినప్పుడే వైద్యులకు గుర్తింపు వస్తుందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. శనివారం వైద్య కళాశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో మోటివేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, నర్సింగ్ పర్యవేక్షకురాలు సావిత్రిబాయి పాల్గొన్నారు.

మొదటి గంటలోనే వైద్యమందించాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: గుండె సమస్యలు వచ్చినప్పుడు మొదటి గంటలోనే వైద్యసేవలందించడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చని జెమ్‌కేర్ కామినేని ఆసుపత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ చెరుకూరి రాఘవేంద్ర అన్నారు. శనివారం జెమ్‌కేర్ కామినేని ఆసుపత్రిలో ప్రపంచ హృద్రోగ దినాన్ని పురస్కరించుకుని కార్డియాలజీ సర్జన్ డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ రవిబాబు, డాక్టర్ బాలమురళీకృష్ణ కేకు కోశారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తితిదే లడ్డూ కల్తీ చేశారని కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కల్లూరు పట్టణం కృష్ణానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం ఓర్వకల్లులో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం చేపట్టారు. ఏఈ రామయ్య, తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, రాము, లక్ష్మీకాంతరెడ్డి, ఈవోఆర్డీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కార్యాచరణతో ఉన్నత శిఖరాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జీవితంలో పక్కా కార్యాచరణతో ఉన్నత శిఖరాలు సాధించవచ్చని ట్రిపుల్ ఐటీ అకడమిక్ డీన్ సత్యబాబు పేర్కొన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాశ్‌రావు ఎన్నిక

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై చేసిన పోరాటాలు ఫలితాన్ని ఇచ్చాయన్నారు.